



జాతీయ తెలుగు దినపత్రిక RNI - TGTEL/25/A0348

# సందేశ టైమ్స్

నిజం దాగదు – వార్త ఆగదు




| గురువారం 05 మార్చి 2026 | పేజీలు 04 | వెల - 2/- | సంపుటి 01 సంచిక 276 | ప్రచురణ - తెలంగాణ & ఆంధ్రప్రదేశ్ | ఎడిటర్ : కాసే అమృత |
|---|---|---|---|---|---|



## ప్రజాపాలన ప్రగతి 99 రోజుల కార్యాచరణను పకడ్బందీగా అమలు చేయాలి: జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్

సూర్యాపేట సందేశం టైమ్స్,సూర్యాపేట, మార్చి 5: రాష్ట్ర ప్రభుత్వం మార్చి 6వ తేదీ నుంచి ప్రతిష్టాత్మకంగా చేపట్టనున్న ప్రజాపాలన ప్రగతి 99 రోజుల కార్యక్రమాన్ని పకడ్బందీగా అమలు చేయాలని జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ అధికారులను ఆదేశించారు. బుధవారం జిల్లా కలెక్టరేట్ సమావేశ మందిరంలో రెవెన్యూ, పంచాయతీరాజ్, ప్రణాళిక, ఇరిగేషన్, వ్యవసాయం, ఉద్యానవన, విద్య, వైద్య, సంక్షేమ తదితర శాఖల అధికారులతో నిర్వహించిన సమీక్షా సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రజా సమస్యల పరిష్కారం, సేవల సమర్థవంతమైన అందజేత ప్రతి ప్రభుత్వ ఉద్యోగి బాధ్యత అని పేర్కొన్నారు. ఆరోగ్యం, అరైవ్-అలైవ్, సంక్షేమం, పిల్లల భద్రత, డ్రగ్స్ అడ్డుకట్ట, రైతు సంక్షేమం, వ్యవసాయం, విద్య, యువత, క్రీడలు, మహిళలు, పర్యావరణం అంశాలపై విపులంగా దిశానిర్దేశం చేశారు. యువతలో నాయకత్వ లక్షణాల పెంపొందనకు యూత్ వీక్ కార్యక్రమాలు నిర్వహించాలని, జిల్లా స్థాయి టెలికమ్యూనికేషన్ కమిటీల ఏర్పాటు చేయాలని సూచించారు. ఇకపై అన్ని ఫైళ్లు ఈ-ఆఫీస్ ద్వారానే పంపాలని స్పష్టం చేస్తూ ప్రత్యేక అధికారులు సంక్షేమ గృహాల తనిఖీలు నిర్వహించి నివేదికలు సమర్పించాలని ఆదేశించారు. టాస్క్ ద్వారా యువతకు వృత్తి నైపుణ్య శిక్షణ కార్యక్రమాలు చేపట్టాలని, ప్రణాళిక అధికారి నోడల్ అధికారిగా వ్యవహరిస్తారని తెలిపారు. మున్సిపాలిటీలు, పంచాయతీల్లో పారిశుధ్య కార్యక్రమాలు చేపట్టి పరిశుభ్రతపై ప్రత్యేక దృష్టి సారించాలని, డ్రగ్స్ నివారణ, పిల్లల రక్షణపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని పేర్కొన్నారు. రేషన్ కార్డులు, ఇందిరమ్మ ఇండ్లు, సన్నబియ్యం, రూ.500కే గ్యాస్ తదితర సంక్షేమ పథకాల లబ్ధిదారుల వివరాలను గ్రామసభల్లో చదివి వినిపించాలని, లబ్ధిదారులకు అందిన ప్రయోజనాలను వివరించాలని ఆదేశించారు. భూ సేకరణ, అటవీ అనుమతులపై వేగవంతమైన చర్యలు తీసుకోవాలని, మన ఊరు-మనబడి పెండింగ్ బిల్లులపై నివేదిక సమర్పించాలని డిఈఓను ఆదేశించారు. మండల స్థాయిలో సమావేశాలు నిర్వహించి ప్రభుత్వ సిబ్బందికి కార్యాచరణపై అవగాహన కల్పించాలని, ప్రతిరోజూ నివేదికలు సమర్పించాలని సూచించారు. యూరియా యాప్ వినియోగంపై రైతులకు అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని తెలిపారు. ఈ సమావేశంలో జిల్లా ఎస్పి నరసింహ, అదనపు కలెక్టర్ కె సీతారామారావు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు. జిల్లా పౌర సంబంధాల అధికారి, సూర్యాపేట వారిచే జారీ చేయబడిన ప్రకటన.



## మార్చి రెండో వారంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేతుల మీదుగా మోడల్ హౌసింగ్ కాలనీ ప్రారంభం

సూర్యాపేట సందేశం టైమ్స్, సూర్యాపేట, మార్చి 5: హుజూర్‌నగర్ నియోజకవర్గ కేంద్రంలోని రామస్వామి గుట్ట వద్ద 110 ఎకరాల విస్తీర్ణంలో నిర్మించిన మోడల్ హౌసింగ్ కాలనీని ఈ నెల రెండో వారంలో ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి చేతుల మీదుగా ప్రారంభించనున్నట్లు రాష్ట్ర నీటిపారుదల, ఆహార పౌర సరఫరాల శాఖ మంత్రి నల్లమాధ ఉత్తమ్ కుమార్ రెడ్డి తెలిపారు. బుధవారం కాలనీని పరిశీలించిన అనంతరం మీడియాతో మాట్లాడుతూ ఆదర్శ గృహ కాలనీ ప్రారంభానికి ముఖ్యమంత్రిని ఆహ్వానించినట్లు చెప్పారు. అవసరమైతే అదనపు సమయం పనిచేసి వచ్చే ఒక వారంలో అన్ని పనులు పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. 110 ఎకరాల్లో రూ.125 కోట్ల వ్యయంతో (భూసేకరణ ఖర్చులు మినహా) నిర్మించిన ఈ కాలనీలో 2,160 ఆధునిక సింగిల్ బెడ్‌రూమ్ ఇళ్లను నిర్మించి అంతే సంఖ్యలో కుటుంబాలకు వసతి కల్పించనున్నట్లు వివరించారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో గృహ నిర్మాణ శాఖ మంత్రిగా ఉన్న సమయంలో ఈ ప్రాజెక్ట్‌ను ప్రారంభించిన విషయాన్ని గుర్తు చేస్తూ, 2014 రాష్ట్ర విభజన తర్వాత ఇది నిర్లక్ష్యానికి గురైందని, 2023లో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన తర్వాత పునరుద్ధరణ చర్యలు చేపట్టి తుదిదశకు చేర్చామని పేర్కొన్నారు. ఎండోమెంట్స్ శాఖ నుంచి పూర్తి మార్కెట్ విలువ చెల్లించి, చట్టబద్ధ అనుమతులతో భూమిని ప్రభుత్వమే కొనుగోలు చేసి నిర్మాణం చేపట్టిందని స్పష్టం చేశారు. ఈ ప్రాజెక్ట్ ఆర్థికంగా వెనుకబడిన వర్గాలు, అత్యంత పేద కుటుంబాలు, గ్రామీణ కూలీలు, రైస్ మిల్ కార్మికులు, హుజూర్‌నగర్ మున్సిపాలిటీ పరిధి ప్రజలు మరియు సమీప గ్రామాల నివాసితుల కోసం ఉద్దేశించబడిందన్నారు. లబ్ధిదారుల ఎంపిక పూర్తిగా పారదర్శకంగా జరగాలని, మొదటి దశలో 1,000 మంది అర్హులైన లబ్ధిదారులను మాత్రమే ఖరారు చేస్తామని తెలిపారు. స్థానిక రెవెన్యూ డివిజనల్ అధికారి ఆధ్వర్యంలో ఈ ప్రక్రియ జరుగుతుందని, ఎటువంటి అవకతవకలకు తావు ఉండదని స్పష్టం చేశారు. ప్రారంభోత్సవానికి సన్నాహాలు కొనసాగుతున్నాయని, కాలనీ పరిసర ప్రాంతాలను సుందరీకరిస్తున్నామని మంత్రి వెల్లడించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ శంకర్ నాయక్, జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్, జిల్లా ఎస్పీ కె నరసింహ, హౌసింగ్ పీడీ సిద్ధార్థ, ఆర్టికల్చర్ పీడీ నాగయ్య, ఆర్డీవో శ్రీనివాసులు, మున్సిపల్ ఛైర్పర్సన్ శ్రీనివాస్, వైస్ ఛైర్మన్ తన్నీరు మల్లికార్జున్, జిల్లా డీసీసీ అధ్యక్షులు నరసయ్య, తహసిల్దార్ కవిత తదితరులు పాల్గొన్నారు. జిల్లా పౌర సంబంధాల అధికారి, సూర్యాపేట చే జారీ చేయబడిన ప్రకటన.

## గ్రామ సమగ్ర అభివృద్ధిలో సర్పంచుల పాత్ర కీలకం





సూర్యాపేట సందేశం టైమ్స్, సూర్యాపేట, మార్చి 5: గ్రామ సమగ్ర అభివృద్ధిలో సర్పంచుల పాత్ర అత్యంత కీలకమని జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ పేర్కొన్నారు. జిల్లా ప్రజా పరిషత్ కార్యాలయంలో నూతనంగా ఎన్నికైన సర్పంచులకు నిర్వహిస్తున్న ఐదు రోజుల శిక్షణ కార్యక్రమానికి ఆయన హాజరై మాట్లాడారు. ఈ నెల 2 నుండి 7వ తేదీ వరకు మూడవ విడతగా సూర్యాపేట, ఆత్మకూర్ (ఎస్), మునగాల, చివ్వేంల, పెన్‌పహాడ్ మండలాల సర్పంచులకు శిక్షణ ఇస్తున్నట్లు తెలిపారు. సర్పంచులు పంచాయతీరాజ్ చట్టం, ప్రభుత్వ పథకాలపై సంపూర్ణ అవగాహన కలిగి ఉండాలని, గ్రామపంచాయతీ పనుల నిర్వహణ, గ్రామ అభివృద్ధి ప్రణాళికల రూపకల్పన, కుటుంబ సంక్షేమం, విద్య, ప్రజారోగ్యం, సామాజిక అభివృద్ధి వంటి అంశాలపై ఈ శిక్షణలో అవగాహన కల్పిస్తున్నామని చెప్పారు. ప్రతి సర్పంచ్ ఈ శిక్షణను సద్వినియోగం చేసుకుని తమ గ్రామాలను ఆదర్శ గ్రామాలుగా తీర్చిదిద్దుకోవాలని సూచించారు. మారుతున్న కాలానికి అనుగుణంగా సాంకేతికతను వినియోగించుకోవాలని, ప్రజా సౌకర్యాల అభివృద్ధిపై ప్రత్యేక శ్రద్ధ పెట్టాలని అన్నారు. కార్యక్రమంలో జిల్లా పంచాయతీ అధికారి యాదగిరి, సర్పంచులు పాల్గొన్నారు. జిల్లా పౌర సంబంధాల అధికారి, సూర్యాపేట వారిచే జారీ చేయబడిన ప్రకటన.

## సింగూరు డ్యామ్ సేఫ్టీ పనులు పూర్తి చేయాలి: రాష్ట్ర మంత్రుల ఆదేశం

### యుద్ధ ప్రాతిపదికన పనులు చేపట్టాలని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి ఆదేశం






హైదరాబాద్, సందేశం టైమ్స్ ప్రతినిధి శెట్టి వెంకటేష్: మార్చి 5: సింగూర్ డ్యామ్ భద్రత ప్రభుత్వానికి అత్యున్నత ప్రాధాన్యమని, హైదరాబాద్ నగరానికి ప్రాణాధారంగా నిలిచిన ఈ ప్రాజెక్టు పరిరక్షణకు అన్ని రకాల కట్టుదిట్టమైన చర్యలు తీసుకుంటామని రాష్ట్ర నీటిపారుదల శాఖ మంత్రి కెప్టెన్ ఎన్. ఉత్తమ్ కుమార్ రెడ్డి స్పష్టం చేశారు. బుధవారం డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ సచివాలయంలో మంత్రులు పొంగులేటి శ్రీనివాసరెడ్డి, సీతక్క, వివేక్ వెంకటస్వామిలతో కలిసి నీటిపారుదల శాఖ అధికారులతో నిర్వహించిన ఉన్నత స్థాయి సమీక్షా సమావేశంలో ఆయన మాట్లాడారు. సింగూర్ డ్యామ్ భద్రతపై జాతీయ ఆనకట్ట భద్రతా సంస్థ హెచ్చరికల నేపథ్యంలో, తక్షణమే సోనార్ పరీక్షలు, అండర్‌వాటర్ సర్వేలు నిర్వహించి రెండు మూడు రోజుల్లో నివేదిక సమర్పించాలని అధికారులను ఆదేశించారు. ప్రాజెక్టు ఎంబాంక్‌మెంట్‌లో చీలికలు, స్లోప్ ఎరోషన్ వంటి సమస్యలను గుర్తించినట్లు తెలుపుతూ, తానే స్వయంగా క్షేత్రస్థాయిలో పర్యటించి పరిస్థితిని సమీక్షిస్తానని ప్రకటించారు. రాష్ట్రవ్యాప్తంగా పెండింగ్‌లో ఉన్న ప్రాజెక్టుల భూసేకరణ కోసం 5,000 కోట్ల రూపాయలను విడుదల చేయనున్నట్లు వెల్లడించిన మంత్రి, జూన్ 2వ తేదీ నాటికి భూసేకరణ ప్రక్రియను పూర్తి చేయాలని లక్ష్యంగా విధించారు. అలాగే ములుగు జిల్లాలోని పాలెంవాగు ప్రాజెక్టు గేట్లు, రెగ్యులేటర్ సమస్యలను పరిష్కరించాలని, సింగూర్ కాలువ లైనింగ్ పనులలో మిగిలిన 4 కిలోమీటర్ల మేర పనులను అత్యవసరంగా పూర్తి చేసి రైతులకు సాగునీరు అందేలా చూడాలని ఇంజనీర్లను ఆదేశించారు.

## అంబేడ్కర్ ఓవర్సీస్ విద్యానిధి పథకానికి దరఖాస్తుల ఆహ్వానం

సూర్యాపేట, సందేశం టైమ్స్ ప్రతినిధి శెట్టి వెంకటేష్: హైదరాబాద్, మార్చి 5: విదేశాల్లో ఉన్నత విద్యను అభ్యసించాలనుకునే ఎస్సీ విద్యార్థుల కోసం తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న అంబేడ్కర్ ఓవర్సీస్ విద్యానిధి పథకం కింద స్కాలర్‌షిప్‌లకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు సూర్యాపేట జిల్లా షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి అధికారిణి శ్రీమతి కె. దయానంద రాణి ఒక ప్రకటనలో తెలిపారు. అమెరికా, యూకే, కెనడా, ఆస్ట్రేలియా, సింగపూర్, జర్మనీ, జపాన్, సౌత్ కొరియా మరియు న్యూజిలాండ్ వంటి దేశాల్లోని ప్రముఖ విశ్వవిద్యాలయాల్లో పోస్ట్ గ్రాడ్యుయేషన్ కోర్సులు చేయాలనుకునే అర్హులైన ఎస్సీ విద్యార్థులు మార్చి 31వ తేదీ లోపు ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలని ఆమె సూచించారు. 2026 ఫిబ్రవరి 1వ తేదీ నుంచి ప్రారంభమైన ఈ దరఖాస్తు ప్రక్రియకు సంబంధించిన పూర్తి వివరాలు మరియు దరఖాస్తు ఫారాలు అధికారిక ఈ-పాస్ వెబ్‌సైట్ https://telanganaepass.cgg.gov.in ద్వారా పొందవచ్చని, విదేశాల్లో ఉన్నత చదువులు అభ్యసించాలనుకునే విద్యార్థులు ఈ అద్భుతమైన అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. మరిన్ని వివరాల కోసం అభ్యర్థులు జిల్లా షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి కార్యాలయాన్ని లేదా 9848503644 నంబర్‌ను సంప్రదించవచ్చని ఆమె ఈ సందర్భంగా పేర్కొన్నారు.

## 46 లక్షల మంది మహిళల హెల్త్ ప్రొఫైల్ తయారీకి రంగం సిద్ధం: మంత్రి దామోదర్ రాజనర్సింహ





హైదరాబాద్, సందేశం టైమ్స్ ప్రతినిధి శెట్టి వెంకటేష్: మార్చి 5: రాష్ట్రవ్యాప్తంగా ఉన్న సుమారు 46 లక్షల మంది స్వయం సహాయక సంఘాల మహిళల ఆరోగ్య పరిరక్షణే ధ్యేయంగా వారి హెల్త్ ప్రొఫైల్‌ను రూపొందించాలని తెలంగాణ ప్రభుత్వం నిర్ణయించింది. ఈ నెల 8న అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా ఈ బృహత్తర కార్యక్రమాన్ని ప్రారంభించనున్నట్లు రాష్ట్ర ఆరోగ్యశాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ వెల్లడించారు. బుధవారం సచివాలయంలో జరిగిన ఉన్నత స్థాయి సమీక్షా సమావేశంలో 'ప్రజాపాలన-ప్రగతి ప్రణాళిక' కింద ఆరోగ్యశాఖ చేపట్టాల్సిన 99 రోజుల యాక్షన్ ప్లాన్‌ను మంత్రి ఆమోదించారు. ఈ ప్రణాళికలో భాగంగా తెలంగాణ డయాగ్నస్టిక్స్ ద్వారా ఒక్కో మహిళకు 30 రకాల వైద్య పరీక్షలు నిర్వహిస్తారని, ఈ ప్రక్రియను మూడు దశల్లో ఆరు నెలల కాలపరిమితిలో పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. మొత్తం నాలుగు దశల్లో సాగే ఈ 99 రోజుల కార్యక్రమంలో తొలి దశలో మాతా శిశు సంరక్షణ, రక్తహీనత నివారణపై దృష్టి సారిస్తామని, ఏప్రిల్ నుంచి అసంక్రమిత వ్యాధులైన బీపీ, షుగర్, క్యాన్సర్ స్క్రీనింగ్ క్యాంపులు నిర్వహిస్తామని తెలిపారు. అలాగే ఎండల తీవ్రత దృష్ట్యా వడదెబ్బ, సీజనల్ వ్యాధులపై ప్రజలకు అవగాహన కల్పించాలని, పట్టణ ప్రాంతాల్లో 145 అర్బన్ పిహెచ్‌సీలను పాలిక్లినిక్స్‌గా అప్‌గ్రేడ్ చేసి స్పెషాలిటీ వైద్య సేవలను పేదలకు చేరువ చేయాలని మంత్రి సూచించారు. ఈ సమావేశంలో ఆరోగ్యశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ క్రిస్టినా జడ్ చొంగ్తు, కమిషనర్ సంగీత సత్యనారాయణ మరియు ఇతర కీలక విభాగాల ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

# కేంద్ర ఓబీసీ జాబితాలో 40 కులాలను చేర్చిన తర్వాతే జనగణన చేపట్టాలి: బీసీ కమిషన్ డిమాండ్

హైదరాబాద్, సందేశం టైమ్స్ ప్రతినిధి శెట్టి వెంకటేష్: మార్చి 5: తెలంగాణ రాష్ట్రంలో వెనుకబడిన తరగతుల సంఖ్యను శాస్త్రీయంగా నమోదు చేసేందుకు గాను, కేంద్ర ప్రభుత్వం తన ఓబీసీ జాబితాలో రాష్ట్రానికి చెందిన మరో 40 కులాలను వెంటనే చేర్చాలని తెలంగాణ రాష్ట్ర వెనుకబడిన తరగతుల కమిషన్ డిమాండ్ చేసింది. బుధవారం విడుదల చేసిన ఒక ప్రకటనలో, మే 11 నుండి జూన్ 9, 2026 వరకు జరగనున్న గృహాల నమోదు (House Listing) ప్రక్రియలో కేవలం కేంద్ర జాబితాలోని 90 కులాలనే పరిగణనలోకి తీసుకుంటే, రాష్ట్రంలోని బీసీల జనాభా తక్కువగా నమోదయ్యే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేసింది. తెలంగాణ ప్రభుత్వం గుర్తించిన 130 బీసీ కులాలలో 40 కులాలను కేంద్ర ఓబీసీ జాబితాలో చేర్చాలని గతంలోనే విజ్ఞప్తి చేసినప్పటికీ, ఇప్పటి వరకు ఎటువంటి నిర్ణయం తీసుకోలేదని కమిషన్ పేర్కొంది. ఈ 40 కులాలను కేంద్ర జాబితాలో చేర్చిన తర్వాతే జనగణనను ప్రారంభించాలని, ఈ విషయంలో తగిన చర్యలు తీసుకోవాలని కోరుతూ రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శ్రీ రామకృష్ణారావు గారికి బీసీ కమిషన్ చైర్మన్ కార్యాలయం నుండి లేఖ రాసినట్లు వెల్లడించింది. దీనివల్ల రాష్ట్రంలోని బీసీ వర్గాలకు జనాభా దామాషా ప్రకారం దక్కాల్సిన ప్రయోజనాలు కుంటుపడకుండా చూడవచ్చని కమిషన్ అభిప్రాయపడింది.



# మహేంద్రా ట్రాక్టర్స్‌లో 800 పైగా ఉద్యోగాలు జిల్లా కలెక్టర్ పి. ప్రావీణ్య

సంగారెడ్డి, సందేశం టైమ్స్ ప్రతినిధి శెట్టి వెంకటేష్: మార్చి 5: జహీరాబాద్‌లోని ప్రముఖ ఆటోమొబైల్ తయారీ సంస్థ మహేంద్రా & మహేంద్రా ట్రాక్టర్స్ యూనిట్‌లో 800కు పైగా ఉద్యోగ ఖాళీల భర్తీకి భారీ నియామక ప్రక్రియ చేపట్టనున్నట్లు జిల్లా కలెక్టర్ పి. ప్రావీణ్య వెల్లడించారు. డిజిటల్ ఎంప్లాయిమెంట్ ఎక్స్చేంజ్ ఆఫ్ తెలంగాణ (DEET) ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఈ రిక్రూట్‌మెంట్ 2026 పోస్టర్‌ను బుధవారం కలెక్టరేట్‌లో ఆమె ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. ఇంటర్మీడియట్, ఐటీఐ (ఫిట్టర్, ఎలక్ట్రీషియన్, వెల్డర్, మెషినిస్ట్), మరియు డిప్లమా అర్హత కలిగిన నిరుద్యోగ యువతకు ఇది ఒక గొప్ప అవకాశమని, దీనిని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ముఖ్యంగా ఉత్పత్తి విస్తరణలో భాగంగా క్వాలిటీ, లైన్ సపోర్ట్ వంటి వివిధ సాంకేతిక విభాగాల్లో ఈ నియామకాలు జరుగుతాయని తెలిపారు. జీఎం డిఐసి తుల్జానాయక్ మాట్లాడుతూ.. ఈ ప్రక్రియ అంతా అత్యంత పారదర్శకంగా జరుగుతుందని, స్థానిక అభ్యర్థులకు ప్రాధాన్యం ఉంటుందని స్పష్టం చేశారు. ఆసక్తి గల అభ్యర్థులు పోస్టర్‌పై ఉన్న క్యూఆర్ (QR) కోడ్‌ను స్కాన్ చేసి తమ వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేసుకోవాలని, రిజిస్ట్రేషన్ చేసుకున్న వారికి త్వరలోనే ఇంటర్వ్యూ సమాచారం అందుతుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మహేంద్రా సంస్థ హెచ్ఆర్ మేనేజర్ యాస్మిన్, అదనపు కార్పొరేట్ రిలేషన్స్ డైరెక్టర్ పి. వంశీధర్ రెడ్డి, DEET ప్రతినిధి శివకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

# విద్యుదాఘాతంతో కోళ్ల ఫామ్‌లో అస్సాం కార్మికుడి మృతి



అనంతగిరి, సందేశం టైమ్స్ ప్రతినిధి శెట్టి వెంకటేష్: మార్చి 5: అనంతగిరి మండల పరిధిలోని వాయిల సింగారం గ్రామ శివారులో గల ఒక కోళ్ల ఫామ్‌లో విద్యుత్ షాక్‌కు గురై అస్సాం రాష్ట్రానికి చెందిన జలాలుద్దీన్ అనే కార్మికుడు అక్కడికక్కడే మృతి చెందాడు. బుధవారం ఉదయం సుమారు 10 గంటల సమయంలో జలాలుద్దీన్ తన భార్య మరియు తోటి పనివారితో కలిసి కోళ్ల ఫామ్ షెడ్డును శుభ్రం చేస్తుండగా, విద్యుత్ మోటార్ అకస్మాత్తుగా ఫెయిల్ అయి షార్ట్ సర్క్యూట్ సంభవించింది. ఈ ప్రమాదంలో జలాలుద్దీన్‌కు బలమైన విద్యుత్ షాక్ తగలడంతో అతను ఘటన స్థలంలోనే ప్రాణాలు కోల్పోయాడు. మృతుని భార్య సమీనా అక్తర ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. ఘటన స్థలానికి చేరుకున్న పోలీసులు మృతదేహాన్ని పరిశీలించి, పోస్టుమార్టం నిమిత్తం కోదాడ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అనంతరం మృతదేహాన్ని కుటుంబ సభ్యులకు అప్పగించారు. మృతుడికి భార్యతో పాటు ఒక కుమార్తె ఉన్నారు. ఉపాధి కోసం సుదూర ప్రాంతం నుండి వచ్చిన కార్మికుడు ఇలా ప్రమాదవశాత్తు మరణించడంతో తోటి కార్మికులలో విషాదం నెలకొంది

# వట్‌పల్లిలో సీసీ కెమెరాల ప్రారంభోత్సవం ముఖ్య అతిథిగా డీఎస్పీ సత్యయ్య గౌడ్




వట్‌పల్లి, సందేశం టైమ్స్ ప్రతినిధి శెట్టి వెంకటేష్: మార్చి 5: అందోల్ నియోజకవర్గంలోని వట్‌పల్లి మండల కేంద్రంలో భద్రతా పరిరక్షణలో భాగంగా నూతనంగా ఏర్పాటు చేసిన సీసీ కెమెరాల ప్రారంభోత్సవ కార్యక్రమం బుధవారం ఘనంగా నిర్వహించబడింది. ఈ కార్యక్రమానికి సంగారెడ్డి జిల్లా డీఎస్పీ సత్యయ్య గౌడ్ ముఖ్య అతిథిగా హాజరై, జోగిపేట సీఐ అనిల్ కుమార్ మరియు వట్‌పల్లి ఎస్ఐ లవకుమార్‌లతో కలిసి సీసీ కెమెరాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా డీఎస్పీ మాట్లాడుతూ.. నేరాల నియంత్రణలోనూ, శాంతిభద్రతల పరిరక్షణలోనూ సీసీ కెమెరాలు కీలక పాత్ర పోషిస్తాయని, ప్రతి గ్రామంలోనూ భద్రతను బలోపేతం చేసేందుకు ఇవి దోహదపడతాయని పేర్కొన్నారు. ఇదే కార్యక్రమంలో వట్‌పల్లి మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు ప్రతాప్ రమేష్ జోషి, టీపీసీసీ ఉపాధ్యక్షులు సంగమేశ్వర్, మరియు రాంరెడ్డిలు పోలీసు అధికారులను శాలువాలతో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో వట్‌పల్లి మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు, వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు మరియు స్థానిక ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొని, పోలీసుల చొరవను అభినందించారు.




# కోదాడ నియోజకవర్గాన్ని వ్యవసాయంలో సస్యశ్యామలం చేస్తాము: మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి

సూర్యాపేట, సందేశం టైమ్స్ ప్రతినిధి శెట్టి వెంకటేష్: మార్చి 5: కోదాడ నియోజకవర్గాన్ని వ్యవసాయ రంగంలో అభివృద్ధి పథంలో నడిపించి సస్యశ్యామలం చేస్తామని రాష్ట్ర ఆహార పౌరసరఫరాల మరియు నీటిపారుదల శాఖ మంత్రి నల్లమాద ఉత్తమ్ కుమార్ రెడ్డి స్పష్టం చేశారు. బుధవారం పాలేరు వాగుపై నిర్మిస్తున్న రెడ్లకుంట ఎత్తిపోతల పథకం నిర్మాణ పనులను అధికారులతో కలిసి క్షేత్రస్థాయిలో పరిశీలించిన మంత్రి, ఈ ప్రాజెక్టు పనులను ఎట్టి పరిస్థితుల్లోనూ మే నెల చివరి నాటికి పూర్తి చేయాలని కాంట్రాక్టర్లను, అధికారులను ఆదేశించారు. రూ.14 కోట్ల వ్యయంతో చేపట్టిన ఈ ఎత్తిపోతల పథకం ద్వారా నల్లబండగూడెం, కాపుగల్లు, రెడ్లకుంట పరిధిలోని 4,500 ఎకరాలకు సాగునీరు అందడమే కాకుండా, గ్రామాలకు తాగునీరు కూడా సరఫరా అవుతుందని ఆయన వివరించారు. ఈ ప్రాజెక్టు కోసం 3 ఎకరాల 39 కుంటల భూమిని సేకరించి రైతులకు 2 కోట్ల రూపాయల పరిహారం చెల్లించామని తెలిపారు. ఈ ఖరీఫ్ సీజన్‌లో తెలంగాణలో రికార్డు స్థాయిలో 72 లక్షల మెట్రిక్ టన్నుల వరి దిగుబడి వచ్చిందని, రైతుల నుండి కొనుగోలు చేసిన ధాన్యానికి బోనస్‌తో కలిపి రూ.19,800 కోట్లు చెల్లించామని మంత్రి పేర్కొన్నారు. రాజకీయాలకు అతీతంగా కోదాడ, హుజూర్ నగర్ నియోజకవర్గాలను అన్ని విధాల అభివృద్ధి చేస్తామని, ఎస్సీ, ఎస్టీ, బీసీ బలహీన వర్గాల సంక్షేమమే ధ్యేయంగా ప్రజా ప్రభుత్వం పనిచేస్తుందని ఆయన పునరుద్ఘాటించారు. ఈ కార్యక్రమంలో ఇరిగేషన్ సీఈ రమేష్, ఆర్డీఓ సూర్యనారాయణ, స్థానిక ప్రజాప్రతినిధులు మరియు ఇతర అధికారులు పాల్గొన్నారు.



# మండల కేంద్రంలో సీసీ కెమెరాల అవగాహన కార్యక్రమం: డీఎస్పీ సత్యయ్యకు ఘన సన్మానం

వట్‌పల్లి, సందేశం టైమ్స్ ప్రతినిధి శెట్టి వెంకటేష్: మార్చి 5: వట్‌పల్లి మండలంలోని ప్రతి గ్రామంలో శాంతిభద్రతల పరిరక్షణ మరియు సీసీ కెమెరాల ఆవశ్యకతపై అవగాహన కార్యక్రమం బుధవారం ఘనంగా నిర్వహించబడింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన సంగారెడ్డి డీఎస్పీ సత్యయ్య, సీఐ అనిల్ కుమార్ మరియు ఎస్ఐ లవకుమార్‌లను గ్రామ సర్పంచ్ ఎస్. శ్రీకాంత్ రెడ్డి ఆధ్వర్యంలో ప్రజాప్రతినిధులు శాలువాలతో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా డీఎస్పీ సత్యయ్య మాట్లాడుతూ, గ్రామాల్లో సీసీ కెమెరాల ఏర్పాటు ప్రజల భద్రతకు కవచంలా పనిచేస్తుందని, నేరాల నియంత్రణలోనూ, నిందితులను వెంటనే పట్టుకోవడంలోనూ ఇవి పోలీసులకు ఎంతగానో దోహదపడతాయని పేర్కొన్నారు. ప్రతి ఒక్కరూ పోలీసులకు సహకరిస్తూ భద్రతా చర్యల్లో భాగస్వాములు కావాలని ఆయన పిలుపునిచ్చారు. అనంతరం సీఐ అనిల్ కుమార్ మరియు ఎస్ఐ లవకుమార్ మాట్లాడుతూ సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించుకుని గ్రామాలను సురక్షితంగా మార్చుకోవాలని, అనుమానాస్పద వ్యక్తులు కనిపిస్తే వెంటనే సమాచారం అందించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపిటీసీ సాలె నర్సింలు, ఉప సర్పంచ్ కవేలి రాజు, వివిధ గ్రామ పెద్దలు, మహిళలు మరియు యువకులు పెద్ద సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

# ఆరోగ్య శాఖ మంత్రిని మర్యాదపూర్వకంగా కలిసిన ఎంపీ సురేష్ కుమార్ శెట్కార్, మున్సిపల్ చైర్మన్ నాగేష్ శెట్కార్



హైదరాబాద్, సందేశం టైమ్స్ ప్రతినిధి శెట్టి వెంకటేష్: మార్చి 5: రాష్ట్ర ఆరోగ్య శాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహను జహీరాబాద్ ఎంపీ సురేష్ కుమార్ శెట్కార్ మరియు నారాయణఖేడ్ మున్సిపల్ చైర్మన్ నాగేష్ శెట్కార్ బుధవారం హైదరాబాద్‌లో మర్యాదపూర్వకంగా కలిశారు. ఇటీవల నారాయణఖేడ్ మున్సిపల్ చైర్మన్‌గా బాధ్యతలు చేపట్టిన నాగేష్ శెట్కార్‌కు ఈ సందర్భంగా మంత్రి ప్రత్యేకంగా శుభాకాంక్షలు తెలియజేయడమే కాకుండా, ఖేడ్ మున్సిపాలిటీ పరిధిలో చేపట్టాల్సిన పలు అభివృద్ధి పనులపై నాయకులతో విస్తృతంగా చర్చించారు. నారాయణఖేడ్ మున్సిపల్ అభివృద్ధికి మరియు మౌలిక సదుపాయాల కల్పనకు ప్రత్యేక నిధులు మంజూరు చేయాలని ఎంపీ మరియు మున్సిపల్ చైర్మన్ మంత్రికి విన్నవించగా, అందుకు మంత్రి సానుకూలంగా స్పందించారు. ప్రజా సమస్యల పరిష్కారానికి, పట్టణ సుందరీకరణకు ప్రభుత్వం తరఫున అన్ని విధాల సహకారం అందిస్తామని, అభివృద్ధి పనులకు అవసరమైన నిధుల మంజూరుకు కృషి చేస్తానని మంత్రి హామీ ఇచ్చారు. ఈ సమావేశంలో పలువురు ప్రజాప్రతినిధులు, ముఖ్య నాయకులు పాల్గొన్నారు.

# మిద్దె అఖిలేష్ యాదవ్‌కు హృదయపూర్వక జన్మదిన శుభాకాంక్షలు



జహీరాబాద్ మార్చి 5(సందేశం టైమ్స్ సంగారెడ్డి జిల్లా ప్రతినిధి టీ సంగమేశ్వర్) మిద్దె అఖిలేష్ యాదవ్‌కు జన్మదిన శుభాకాంక్షలు తెలియజేస్తూ, ఇలాంటి పుట్టినరోజు వేడుకలు మరెన్నో జరుపుకోవాలని తల్లిదండ్రుల ఆశీస్సులతో, దేవుని కృపతో, కుటుంబ సభ్యుల దీవెనలతో నీవు కోటి కాంతుల చిరునవ్వుతో నిండు నూరేళ్లు సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో, ఐశ్వర్యాలతో జీవించాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నాము. నీవు అనుకున్న లక్ష్యాలను సాధిస్తూ జీవితంలో ఉన్నత శిఖరాలకు చేరుకోవాలని, ప్రతి క్షణం ఆనందంగా గడపాలని ఆశిస్తున్నాము. ఈ పుట్టినరోజు నీ జీవితంలో కొత్త ఉత్సాహానికి నాంది కావాలని కోరుతూ – మీ తండ్రి మిద్దె మల్లేష్ యాదవ్, మీ తల్లి మిద్దె నాగమణి, మీ తమ్ముడు ఆశీస్సులతో హృదయపూర్వక జన్మదిన శుభాకాంక్షలు."



## వట్‌పల్లి సీసీ కెమెరాల ప్రారంభోత్సవం – డీఎస్పీ సత్తయ్యకు బిజిలిపూర్ యువనేత అరవింద్ ఘన సన్మానం

వట్పల్లి మర్చి 5( సందేశం టైం సంగారెడ్డి జిల్లా ప్రతినిధి టీ సంగమేశ్వర్)సంగారెడ్డి జిల్లా వట్పల్లి మండల కేంద్రంలో నూతనంగా ఏర్పాటు చేసిన సీసీ కెమెరాల ప్రారంభోత్సవానికి విచ్చేసిన డీఎస్పీ సత్తయ్యను బిజిలిపూర్ యువనేత అరవింద్ శాలువాతో సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, "గ్రామాల భద్రతకు సీసీ కెమెరాలు కీలకంగా మారాయి. ప్రజల రక్షణ కోసం పోలీస్ శాఖ చేపడుతున్న చర్యలకు మేము ఎల్లప్పుడూ సహకరిస్తాం" అని పేర్కొన్నారు. కార్యక్రమంలో స్థానిక నాయకులు, యువకులు పాల్గొన్నారు.



## చిన్న పెద్ద తేడా లేకుండా జరుపుకునే పండుగ హోలీ: నీలం మధు ముదిరాజ్

మెదక్, సందేశం టైమ్స్ ప్రతినిధి శెట్టి వెంకటేష్: మార్చి 5: చిన్న పెద్ద అనే తేడా లేకుండా అందరూ ఒకచోట చేరి ఆనందోత్సాహాల మధ్య రంగులు చల్లుకుంటూ జరుపుకునే విశిష్టమైన పండుగ హోలీ అని మెదక్ పార్లమెంట్ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ నీలం మధు ముదిరాజ్ పేర్కొన్నారు. బుధవారం హోలీ పండుగను పురస్కరించుకుని ఇస్నాపూర్ మున్సిపాలిటీ పరిధిలోని చిట్కుల్‌లో గల తన క్యాంపు కార్యాలయంలో కార్యకర్తలు మరియు స్థానిక ప్రజలతో కలిసి ఆయన ఆహ్లాదకర వాతావరణంలో వేడుకలు జరుపుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, శివుని తపస్సును భంగపరిచిన కామదేవుడిని శివుడు తన త్రినేత్రంతో భస్మం చేయడం, ఆ తర్వాత రతి దేవి ప్రార్థనతో కామదేవుడికి తిరిగి ప్రాణం పోసిన పౌరాణిక నేపథ్యాన్ని స్మరించుకుంటూ దేశవ్యాప్తంగా ఈ వసంతోత్సవాన్ని జరుపుకుంటారని వివరించారు. ఈ రంగుల పండుగ సమాజంలో విభేదాలను చెరిపివేసి ఐక్యతను, సోదరభావాన్ని మరియు స్నేహబంధాన్ని పెంపొందించే గొప్ప వేడుకగా నిలుస్తుందని ఆయన ఆకాంక్షించారు.



## సైబర్ నేరాల నుంచి రక్షణకు అవగాహనే మార్గం: ఎస్పీ పరితోష్ పంకజ్

సంగారెడ్డి, సందేశం టైమ్స్ ప్రతినిధి శెట్టి వెంకటేష్: మార్చి 5: సైబర్ నేరాల నియంత్రణకు ప్రజల్లో అవగాహనే ప్రధాన ఆయుధమని సంగారెడ్డి జిల్లా ఎస్పీ పరితోష్ పంకజ్ పేర్కొన్నారు. తెలంగాణ రాష్ట్ర పోలీసు శాఖ, సైబర్ సెక్యూరిటీ బ్యూరో ఆధ్వర్యంలో "సైబర్ జాగ్రుకత దివాస్" మరియు "ఫ్రాడ్ కా ఫుల్ స్టాప్" పేరిట జిల్లా వ్యాప్తంగా బుధవారం విస్తృత అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా సుల్తాన్‌పూర్ లోని జవహర్ లాల్ నెహ్రూ టెక్నాలజికల్ యూనివర్సిటీ (JNTU) ఇంజనీరింగ్ కళాశాల విద్యార్థులకు ఏర్పాటు చేసిన ప్రత్యేక కార్యక్రమంలో ఎస్పీ మాట్లాడుతూ.. ఈజీ మనీ ఆశ చూపే మోసగాళ్ల వలలో పడవద్దని, మల్టీ లెవెల్ మార్కెటింగ్, నకిలీ ట్రేడింగ్, పార్ట్‌టైమ్ ఉద్యోగాలు మరియు ఇన్వెస్ట్‌మెంట్ ఫ్రాడ్స్ పట్ల అప్రమత్తంగా ఉండాలని హెచ్చరించారు. ముఖ్యంగా ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (AI) వినియోగంతో సైబర్ మోసాలు పెరుగుతున్నాయని, "డిజిటల్ అరెస్ట్" వంటి భయపెట్టే పద్ధతులకు అసలు చట్టబద్ధత లేదని ఆయన స్పష్టం చేశారు. అపరిచిత లింకులు, ఏపీకే ఫైళ్లు ఓపెన్ చేయవద్దని సూచిస్తూ.. ఎవరైనా సైబర్ నేరాలకు గురైతే తక్షణమే 1930 హెల్ప్‌లైన్ నంబర్‌కు కాల్ చేయాలని లేదా ఎన్‌సీఆర్‌బీ వెబ్‌సైట్‌లో ఫిర్యాదు చేయాలని కోరారు. సైబర్ సెక్యూరిటీ బ్యూరో డీఎస్పీ ఎన్. వేణుగోపాల్ రెడ్డి ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో జేఎన్‌టీయూ ప్రిన్సిపల్, సిబ్బంది, డి4సి విభాగం ప్రతినిధులు మరియు విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## వట్‌పల్లిలో సీసీ కెమెరాల ప్రారంభోత్సవం

### ముఖ్య అతిథిగా డీఎస్పీ సత్యయ్య గౌడ్





వట్‌పల్లి, సందేశం టైమ్స్ ప్రతినిధి శెట్టి వెంకటేష్: మార్చి 5: సంగారెడ్డి జిల్లా వట్‌పల్లి మండల కేంద్రంలో భద్రతను పటిష్టం చేసే లక్ష్యంతో ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలను జిల్లా డీఎస్పీ సత్యయ్య గౌడ్ బుధవారం ఘనంగా ప్రారంభించారు. జోగిపేట సీఐ అనిల్ కుమార్, వట్‌పల్లి ఎస్ఐ లవకుమార్‌లతో కలిసి ఆయన ఈ ప్రారంభోత్సవ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వట్‌పల్లి మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు ప్రతాప్ రమేష్ జోషి, టీపీసీసీ ఉపాధ్యక్షులు టీ. సంగమేశ్వర్, రాంరెడ్డి మరియు ఇతర నాయకులు కలిసి పోలీసు అధికారులను శాలువాలతో ఘనంగా సన్మానించారు. అనంతరం డీఎస్పీ మాట్లాడుతూ నేరాల నియంత్రణలోనూ, నిందితులను త్వరితగతిన గుర్తించడంలోనూ సీసీ కెమెరాలు ఎంతగానో దోహదపడతాయని, ప్రజల రక్షణ కోసం వీటి ఏర్పాటు ఎంతో అవసరమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఆత్మ కమిటీ చైర్మన్ కాచూర్ రావు, బీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షులు, వివిధ గ్రామాల సర్పంచులు, మాజీ ప్రజాప్రతినిధులు మరియు కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలకు చెందిన ముఖ్య నాయకులు పాల్గొని పోలీసు యంత్రాంగం తీసుకున్న ఈ చొరవను అభినందించారు.



## హోలీ పండుగ ఉత్సవాల్లో పాల్గొన్న బీఆర్ఎస్ నాయకులు మాద్రి పృథ్వీరాజ్

పటాన్‌చెరు, సందేశం టైమ్స్ ప్రతినిధి శెట్టి వెంకటేష్: మార్చి 5: రంగుల పండుగ హోలీని పురస్కరించుకుని పటాన్‌చెరు పట్టణంలోని వివిధ కాలనీలలో నిర్వహించిన హోలీ ఉత్సవాలలో బీఆర్ఎస్ నాయకులు మాద్రి పృథ్వీరాజ్ పాల్గొని సందడి చేశారు. బుధవారం జరిగిన ఈ వేడుకల్లో ఆయన స్థానిక యువకులు, మిత్రులు మరియు అభిమానులతో కలిసి రంగులు చల్లుకుంటూ ఉత్సాహంగా పండుగ జరుపుకున్నారు. ఈ సందర్భంగా పృథ్వీరాజ్ మాట్లాడుతూ.. హోలీ పండుగ మనుషుల మధ్య ఉన్న విభేదాలను తొలగించి ప్రేమ, ఐక్యత మరియు ఆనందాన్ని పెంపొందిస్తుందని ఆకాంక్షించారు. పటాన్‌చెరు నియోజకవర్గ ప్రజలందరూ ఆయురారోగ్యాలతో, సుఖసంతోషాలతో ఉండాలని కోరుకుంటూ అందరికీ హోలీ శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో స్థానిక కాలనీ నాయకులు, యువత మరియు పెద్ద సంఖ్యలో అభిమానులు పాల్గొని, రంగుల మధ్య స్నేహభావంతో వేడుకలను అత్యంత వైభవంగా నిర్వహించారు.

## 99 రోజుల పాటు 'ప్రజా పాలన-ప్రగతి ప్రణాళిక'ను విజయవంతం చేయాలి: సి.ఎస్. రామకృష్ణారావు

హైదరాబాద్, సందేశం టైమ్స్ ప్రతినిధి శెట్టి వెంకటేష్: మార్చి 5:రాష్ట్రవ్యాప్తంగా మార్చి 6 నుంచి ప్రారంభం కానున్న 'ప్రజా పాలన.. ప్రగతి ప్రణాళిక' కార్యక్రమాన్ని అన్ని శాఖల సమన్వయంతో విజయవంతం చేయాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె. రామకృష్ణారావు జిల్లా కలెక్టర్లను ఆదేశించారు. బుధవారం సాయంత్రం ఆయన సచివాలయం నుండి జిల్లా కలెక్టర్లతో నిర్వహించిన టెలీ కాన్ఫరెన్స్‌లో ఈ కార్యక్రమ నిర్వహణ తీరుపై కీలక మార్గదర్శకాలను జారీ చేశారు. ముఖ్యమంత్రి ఆదేశాల మేరకు మార్చి 6 నుంచి జూన్ 12 వరకు 99 రోజుల పాటు ఐదు దశల్లో ఈ కార్యక్రమం గ్రామ, మండల, నియోజకవర్గ, జిల్లా మరియు రాష్ట్ర స్థాయిల్లో జరుగుతుందని ఆయన వివరించారు. ఈ బృహత్తర కార్యక్రమంపై ఉమ్మడి జిల్లా కేంద్రాల్లో జిల్లా ఇన్చార్జ్ మంత్రుల ఆధ్వర్యంలో సన్నాహక సమావేశాలు ఏర్పాటు చేసి, ప్రజాప్రతినిధులను భాగస్వాములను చేయాలని సూచించారు. ముఖ్యంగా ఈ నెల 12వ తేదీన నూతనంగా ఎన్నికైన మున్సిపల్ ఛైర్మన్లు, మేయర్లు, సర్పంచులు మరియు వార్డు సభ్యులకు ప్రత్యేక అవగాహన సదస్సులు నిర్వహించాలని, ఇందుకు పంచాయతీరాజ్, మున్సిపల్ శాఖలు తగిన ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న ఈ ప్రణాళిక ద్వారా క్షేత్రస్థాయిలో ప్రగతి సాధించడమే లక్ష్యమని, దీనికి సంబంధించి ఎప్పటికప్పుడు తదుపరి మార్గదర్శకాలు అందుతాయని సీఎస్ స్పష్టం చేశారు. ఈ టెలీ కాన్ఫరెన్స్‌లో పంచాయతీరాజ్ స్పెషల్ సీఎస్ సంజయ్ కుమార్, ఆర్థిక శాఖ ముఖ్య కార్యదర్శి సందీప్ సుల్తానియా, మున్సిపల్ శాఖ ముఖ్య కార్యదర్శి టి.కె. శ్రీదేవి మరియు ప్రణాళిక శాఖ ప్రత్యేక కార్యదర్శి గౌరవ్ ఉప్పల్ తదితరులు పాల్గొన్నారు.

## చిన్న పెద్ద తేడా లేకుండా జరుపుకునే పండుగ హోలీ నీలం మధు ముదిరాజ్ హోలీ వేడుకలో పాల్గొన్న నీలం





సంగారెడ్డి/మార్చి 05(సందేశం టైమ్స్ సంగారెడ్డి టౌన్ప్ర తినిధి:బి.సంగమేశ్వర్)చిన్న పెద్ద తేడా లేకుండా సంతోషంగా రంగులు చల్లుకుంటూ జరుపుకునే వేడుక హోలీ అని మెదక్ పార్లమెంట్ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ నీలం మధు ముదిరాజ్ అన్నారు.. బుధవారం హోలీ పండుగ సందర్భంగా ఆయన ఇస్నాపూర్ మున్సిపాలిటీ పరిధి చిట్కుల్ లోని ఆయన క్యాంపు కార్యాలయంలో కార్యకర్తలు ప్రజలతో కలిసి ఆహ్లాదకర వాతావరణంలో హోలీ జరుపుకున్నారు, ఈ కార్యక్రమంలో తదితరులు పాల్గొని సంతోషంగా హోలీ పండుగను జరుపుకున్నారు

## తెలంగాణ ఉద్యమకారుల ఫోరం పాలేరు నియోజకవర్గ కన్వీనర్‌గా ఎదురుగట్ల చిట్టిమల్లు నియామకం




ఖమ్మం, సందేశం టైమ్స్ ప్రతినిధి శెట్టి వెంకటేష్: మార్చి 5: ఖమ్మం జిల్లా పాలేరు నియోజకవర్గ తెలంగాణ ఉద్యమకారుల ఫోరం కన్వీనర్‌గా ఎదురుగట్ల చిట్టిమల్లు నియమితులయ్యారు. ఈ మేరకు తెలంగాణ ఉద్యమకారుల ఫోరం రాష్ట్ర కమిటీ నిర్ణయం తీసుకుని ఆయనకు అధికారిక నియామక పత్రాన్ని అందజేసింది. రాష్ట్ర చైర్మన్ డాక్టర్ చీమ శ్రీనివాస్ నేతృత్వంలోని కమిటీ ఈ బాధ్యతలను ఆయనకు అప్పగించింది. తెలంగాణ ఉద్యమకారుల ఫోరం విస్తృతికి తోడ్పడుతూ, నియోజకవర్గ పరిధిలోని ఉద్యమకారుల సంక్షేమం కోసం చిట్టిమల్లు నిరంతరం కృషి చేయాలని ఈ సందర్భంగా రాష్ట్ర కమిటీ ఆకాంక్షించింది. ఆయన ఈ పదవిలో ఒక సంవత్సరం పాటు కొనసాగుతారని నియామక పత్రంలో స్పష్టం చేశారు. పాలేరు నియోజకవర్గ కన్వీనర్‌గా చిట్టిమల్లు నియామకం పట్ల పలువురు ఉద్యమకారులు మరియు స్థానిక నాయకులు సంతోషం వ్యక్తం చేస్తూ ఆయనకు శుభాకాంక్షలు తెలియజేశారు.

## మహత్మ జ్యోతిరావు పూలే రెసిడెన్షియల్ కళాశాలలో సౌకర్యాలు మెరుగ్గా ఉండాలి

### కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్




సూర్యాపేట, సందేశం టైమ్స్ ప్రతినిధి శెట్టి వెంకటేష్: మార్చి ౫: సూర్యాపేట జిల్లాలోని మహాత్మా జ్యోతిరావు పూలే రెసిడెన్షియల్ డిగ్రీ కళాశాలలో విద్యార్థులకు వసతులు మరియు సౌకర్యాలు మెరుగ్గా ఉండాలని, వారికి ఎలాంటి ఇబ్బందులు కలగకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ అధికారులను ఆదేశించారు. బుధవారం సూర్యాపేటలోని బాలికల రెసిడెన్షియల్ కళాశాలను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా హాస్టల్‌లోని డైనింగ్ హాల్, స్టోర్ రూమ్, కిచెన్ షెడ్ మరియు లైబ్రరీని కలెక్టర్ క్షుణ్ణంగా పరిశీలించారు. విద్యార్థులకు అందిస్తున్న భోజనం, పప్పు, కూరల నాణ్యతను తనిఖీ చేసిన ఆయన, నిత్యావసర వస్తువులైన నూనెలు, పప్పులు మరియు తాజా కూరగాయలనే వంటల్లో వినియోగించాలని స్పష్టం చేశారు. వంట సామాగ్రి మరియు కూరగాయలను వెలుతురు తగిలేలా టేబుళ్లపై ఉంచాలని, డైనింగ్ మరియు వాష్ ఏరియాలను ఎల్లప్పుడూ పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. అనంతరం విద్యార్థులతో మాట్లాడిన కలెక్టర్, పరీక్షల్లో అత్యుత్తమ ఫలితాలు సాధించాలని వారిని ప్రోత్సహించారు. విద్యార్థులు తమకు ల్యాబ్, బిల్డింగ్, డైనింగ్ టేబుళ్లు మరియు బెడ్స్ కావాలని కోరగా, వాటిపై సానుకూలంగా స్పందించారు. కళాశాలలో విద్యార్థుల ఫిర్యాదుల కోసం ప్రత్యేక బాక్స్ ఏర్పాటు చేయాలని ప్రిన్సిపల్‌ను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో జిల్లా బీసీ వెల్ఫేర్ అధికారి నరసింహ, కళాశాల ప్రిన్సిపాల్ మరియు ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

## బాసర ఆర్జీయుకేటీలో విద్యార్థులపై వేధింపులు: మానవ హక్కుల కమిషన్‌కు ఆమ్ ఆద్మీ పార్టీ ఫిర్యాదు




హైదరాబాద్, సందేశం టైమ్స్ ప్రతినిధి శెట్టి వెంకటేష్: మార్చి 5: బాసరలోని రాజీవ్ గాంధీ వైజ్ఞానిక సాంకేతిక విశ్వవిద్యాలయం (RGUKT)లో విద్యార్థులపై జరుగుతున్న పోలీసుల బెదిరింపులు, యాజమాన్యం వేధింపులు మరియు వరుస విద్యార్థి మరణాలపై సమగ్ర విచారణ జరపాలని డిమాండ్ చేస్తూ ఆమ్ ఆద్మీ పార్టీ (AAP) తెలంగాణ రాష్ట్ర కమిటీ రాష్ట్ర మానవ హక్కుల కమిషన్‌కు అధికారికంగా ఫిర్యాదు చేసింది. ఈ సందర్భంగా పార్టీ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ బుర్ర రాము గౌడ్ మాట్లాడుతూ, వర్సిటీలో కనీస సౌకర్యాల కోసం ప్రశ్నిస్తున్న విద్యార్థులను స్థానిక డీఎస్పీ మరియు పోలీసులు "కేసులు పెట్టి కెరీర్ నాశనం చేస్తాం" అని బహిరంగంగా బెదిరించడం అత్యంత ఆందోళనకరమని ఆవేదన వ్యక్తం చేశారు. నిధుల గోల్‌మాల్ ఆరోపణలపై ప్రశ్నిస్తున్న విద్యార్థుల గొంతు నొక్కడానికే అధికారులు పరీక్షల్లో ఫెయిల్ చేస్తామని బెదిరిస్తున్నారని, విద్యార్థి నాయకుడు మనీష్ రెడ్డి మొబైల్ ఫోన్‌ను అక్రమంగా స్వాధీనం చేసుకున్నారని ఆయన మండిపడ్డారు. ఈ వేధింపులపై సిట్టింగ్ జడ్జితో సమగ్ర విచారణ జరిపించాలని, విద్యార్థులను బెదిరిస్తున్న పోలీసు మరియు వర్సిటీ అధికారులపై కఠిన చర్యలు తీసుకోవాలని ఆమ్ ఆద్మీ పార్టీ డిమాండ్ చేసింది. క్యాంపస్‌లో విద్యార్థుల ప్రాణ రక్షణ మరియు విద్యా హక్కులను నిర్ధారించేలా మానవ హక్కుల కమిషన్ తక్షణమే జోక్యం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో పార్టీ సీనియర్ నాయకులు దర్శనం రమేష్, కొడంగల్ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

## రోడ్డు ప్రమాద బాధితుడికి వ్యాయామ ఉపాధ్యాయుల భరోసా: రూ. 81 వేల ఆర్థిక సాయం అందజేత



సూర్యాపేట, సందేశం టైమ్స్ ప్రతినిధి శెట్టి వెంకటేష్: మార్చి ౫: సూర్యాపేట జిల్లా నూతనకల్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల (ZPHS) ఫిజికల్ డైరెక్టర్ నాగేందర్ ఇటీవల రోడ్డు ప్రమాదానికి గురై, సుదీర్ఘ కాలం కోమాలో ఉండి ప్రాణాపాయం నుంచి క్షేమంగా కోలుకున్న నేపథ్యంలో జిల్లాలోని వ్యాయామ ఉపాధ్యాయులు ఆయనను పరామర్శించి అండగా నిలిచారు. బుధవారం సూర్యాపేట జిల్లాకు చెందిన వ్యాయామ ఉపాధ్యాయులందరూ కలిసి నాగేందర్ నివాసానికి వెళ్లి ఆయన ఆరోగ్య స్థితిగతులను అడిగి తెలుసుకున్నారు. ప్రమాదం కారణంగా ఇబ్బందుల్లో ఉన్న బాధితుడి కుటుంబానికి భరోసా కల్పిస్తూ, తమ వంతు సహాయంగా ఉపాధ్యాయులంతా సేకరించిన రూ. ౮౧,౦౦౦ (ఎనభై ఒక వేల రూపాయలు) నగదును ఆర్థిక సహాయంగా అందజేశారు. నాగేందర్ కుటుంబానికి వ్యాయామ ఉపాధ్యాయుల సంఘం ఎల్లవేళలా అండగా ఉంటుందని, అధైర్యపడొద్దని వారు ఈ సందర్భంగా ధైర్యం చెప్పారు. ఈ సేవా కార్యక్రమంలో పాలుపంచుకుని మానవత్వాన్ని చాటుకున్న ప్రతి ఒక్కరికి నిర్వాహకులు పేరుపేరునా ధన్యవాదాలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో SGF సెక్రటరీ కిరణ్ కుమార్, PETA TS జిల్లా అధ్యక్షులు ఐతగోని శ్రీనివాస్, TGPETA జిల్లా ప్రధాన కార్యదర్శి యస్. రామ మోహనా చారి, ఫిజికల్ డైరెక్టర్లు యాదయ్య, కుంభం శ్రీనివాస్, ప్రమీల, సైదులు, కీతా రవి కుమార్, రాము, సమత, దాసు, నవీన్, విజయ్, వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొని తమ సంఘీభావాన్ని ప్రకటించారు.



## టీ20 వరల్డ్‌కప్ సెమీఫైనల్: సౌతాఫ్రికాపై న్యూజిలాండ్ ఘనవిజయం.. ఫైనల్‌కు కివీస్

హైదరాబాద్, సందేశం టైమ్స్ ప్రతినిధి శెట్టి వెంకటేష్: మార్చి ౫: టీ౨౦ వరల్డ్‌కప్‌లో భాగంగా జరిగిన ఉత్కంఠభరిత సెమీఫైనల్ పోరులో సౌతాఫ్రికాపై న్యూజిలాండ్ ౯ వికెట్ల తేడాతో ఘనవిజయం సాధించి ఫైనల్‌కు దూసుకెళ్లింది. కోల్‌కతాలోని ఈడెన్ గార్డెన్స్ వేదికగా జరిగిన ఈ మ్యాచ్‌లో టాస్ గెలిచిన న్యూజిలాండ్ మొదట బౌలింగ్ ఎంచుకోగా, బ్యాటింగ్‌కు దిగిన సౌతాఫ్రికా నిర్ణీత ౨౦ ఓవర్లలో 8 వికెట్ల నష్టానికి ౧౬౯ పరుగులు చేసింది. కివీస్ బౌలర్లు క్రమశిక్షణతో బంతులు వేసి ఎనిమిది వికెట్లు పడగొట్టడంతో సౌతాఫ్రికా భారీ స్కోరు సాధించలేకపోయింది. అనంతరం ౧౭౦ పరుగుల లక్ష్యంతో బరిలోకి దిగిన న్యూజిలాండ్ జట్టు ఆరంభం నుంచే విరుచుకుపడింది. ముఖ్యంగా ఓపెనర్ ఫిన్ ఎలెన్ విధ్వంసకర బ్యాటింగ్‌తో చెలరేగి కేవలం ౩౩ బంతుల్లోనే సెంచరీ పూర్తి చేసి టీ౨౦ వరల్డ్‌కప్‌లో ఫాస్టెస్ట్ సెంచరీ రికార్డును నెలకొల్పాడు. కేవలం ౧౨.౫ ఓవర్లలోనే ఒకే ఒక్క వికెట్ కోల్పోయి ౧౭౩ పరుగులు చేసిన న్యూజిలాండ్, ఇంకా ౪౩ బంతులు మిగిలి ఉండగానే విజయాన్ని అందుకుంది. కివీస్ బ్యాటర్ల ధాటికి సౌతాఫ్రికా బౌలర్లు కేవలం ఒక వికెట్ మాత్రమే తీయగలిగారు. ఈ అద్భుత విజయంతో న్యూజిలాండ్ సగర్వంగా ఫైనల్‌లో అడుగుపెట్టింది.

## కాణిపాకం శ్రీ వరసిద్ధి వినాయక స్వామి వారిని దర్శించుకున్న మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి




హైదరాబాద్, సందేశం టైమ్స్ ప్రతినిధి శెట్టి వెంకటేష్: మార్చి 5: ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం చిత్తూరు జిల్లా ఐరాల మండలం కాణిపాకంలో కొలువైన శ్రీ స్వయంభూ వరసిద్ధి వినాయక స్వామి వారిని తెలంగాణ రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణం, సమాచార శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి బుధవారం కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు. ఆలయానికి చేరుకున్న మంత్రికి అర్చకులు, అధికారులు ఘనస్వాగతం పలికారు. ఈ సందర్భంగా మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించి మొక్కులు చెల్లించుకున్నారు. అనంతరం ఆలయ పండితులు వేదాశీర్వచనం చేయగా, అధికారులు తీర్థప్రసాదాలు మరియు స్వామి వారి చిత్రపటాన్ని మంత్రికి అందజేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. ఆ వినాయక స్వామి కృపాకటాక్షాలతో ప్రజలందరూ సుఖసంతోషాలతో ఉండాలని, రాష్ట్రం అన్ని రంగాల్లో అభివృద్ధి చెందుతూ సుభిక్షంగా వర్ధిల్లాలని మనసారా కోరుకున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో మంత్రి కుటుంబ సభ్యులు, ఆలయ అధికారులు మరియు స్థానిక నాయకులు పాల్గొన్నారు.

## మధ్యప్రాచ్యంలో ముదిరిన యుద్ధ జ్వాలలు: అమెరికా, ఇజ్రాయెల్ దాడులతో ఇరాన్ విలవిల

హైదరాబాద్, సందేశం టైమ్స్ ప్రతినిధి మార్చి 5, 2026 రిపోర్టర్ శెట్టి వెంకటేష్: ఇరాన్ దేశంపై అమెరికా మరియు ఇజ్రాయెల్ సంయుక్తంగా చేపట్టిన యుద్ధ చర్యలు ఐదవ రోజుకు చేరుకోవడంతో పశ్చిమాసియాలో పోరాటం తీవ్ర రూపం దాల్చింది, ఫిబ్రవరి ఇరవై ఏడున ప్రారంభమైన ఈ దాడుల్లో ఇప్పటివరకు వెయ్యి మందికి పైగా పౌరులు మరణించారని అంతర్జాతీయ సంస్థలు వెల్లడిస్తుండగా, ఇరాన్ అత్యున్నత నాయకుడి మరణం తర్వాత ఆ దేశం తీవ్ర సంక్షోభంలో కూరుకుపోయింది. బుధవారం నాటి తాజా పరిణామాల్లో భాగంగా శ్రీలంక తీరానికి సమీపంలో ఇరాన్ యుద్ధనౌకను అమెరికా జలాంతర్గామి ముంచివేయగా, ఇజ్రాయెల్ వైమానిక దళం టెహ్రాన్ మరియు లెబనాన్లలోని ఇరాన్ విప్లవాత్మక దళాల ప్రధాన కార్యాలయాలే లక్ష్యంగా ఐదు వేల కంటే ఎక్కువ బాంబులతో విరుచుకుపడింది. ఇందుకు ప్రతిచర్యగా ఇరాన్ తన క్షిపణులతో ఇజ్రాయెల్ భూభాగంపై మరియు ఖతార్‌లోని అమెరికా సైనిక స్థావరంపై దాడులు చేయడంతో పాటు, ప్రపంచ చమురు సరఫరాకు కీలకమైన జలసంధిని మూసివేస్తున్నట్లు ప్రకటించడంతో అంతర్జాతీయ మార్కెట్లో చమురు ధరలు ఆకాశాన్ని తాకుతున్నాయి. ఈ పరిణామాలపై ప్రపంచ దేశాలు భిన్నాభిప్రాయాలు వ్యక్తం చేస్తున్నాయి; చైనా, రష్యా మరియు బ్రెజిల్ దేశాలు ఈ దాడులను తీవ్రంగా ఖండిస్తూ ఒక సార్వభౌమ దేశ నేతను చంపడం అంతర్జాతీయ చట్టాలకు విరుద్ధమని మండిపడగా, కెనడా మరియు ఆస్ట్రేలియా వంటి దేశాలు అమెరికా చర్యలకు మద్దతు తెలిపాయి. భారత్ మాత్రం ఇరు దేశాలు సంయమనం పాటించాలని, చర్చల ద్వారానే సమస్యను పరిష్కరించుకోవాలని పిలుపునిచ్చింది. ఐక్యరాజ్యసమితి భద్రతా మండలి అత్యవసర సమావేశమై కాల్పుల విరమణకు ప్రయత్నిస్తున్నప్పటికీ, అమెరికా రక్షణ శాఖ తాము ఇప్పుడే యుద్ధాన్ని మొదలుపెట్టామని, వెనక్కి తగ్గే ప్రసక్తే లేదని స్పష్టం చేయడంతో పరిస్థితులు మరింత ఆందోళనకరంగా మారాయి.

పత్రిక పేరు : సందేశం టైమ్స్ (Sandesham Times) రిజిస్ట్రేషన్ నం. : TGTEL/25/A0348 , టైటిల్ కోడ్ : Sandhesham Times.ప్రచురణ స్థలం :3- 82 వాయిల సింగారం, అనంతగిరి మండలం,సూర్యాపేట జిల్లా, తెలంగాణ – 508206, ప్రచురణకర్త (Publisher): మద్దినేని నాగేశ్వర రావు, సంపాదకులు (Editor) : కాసే అమృత,మొబైల్ : 9052045435, ఈ–మెయిల్ : sandeshamtimes@gmail.com, వెబ్‌సైట్ : www.sandeshamtimes.com,ముద్రణ (Printed at) : సండే ప్రింటింగ్ ప్రెస్ (Sunday Printing Press)3-4297, సరస్వతి కాంప్లెక్స్, SVN కాలనీ, గుంటూరు,ఆంధ్రప్రదేశ్ – 522006.